ప్రజా ఆశీర్వాదం కోసం..

- మూడు జిల్లాలు.. నాలుగు సభలు
- రేపు జన నేత, సీఎం కేసీఆర్ రాక
- దేవరకద్ర, మక్తల్, నారాయణపేట, గద్వాలలో భారీ బహిరంగ సభలు

దేవరకద్రలో సీఎం సభ కోసం ఏర్పాట్లు చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

మహబూబ్‌నగర్, నవంబర్ 4 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : బీఆర్ఎస్ అధినేత.. ప్రగతి ప్రదాత సీఎం కేసీఆర్ ఈనెల 6న ఉమ్మడి జిల్లాలో ఒకేరోజు మూడు జిల్లాల్లో, నాలుగు బహిరంగ సభల్లో పాల్గొనున్నారు. ఒకే రోజు నాలుగు చోట్ల ప్రజాఆశీర్వద సభల్లో పాల్గొంటుండటంతో రాజకీయ ప్రాధాన్యత సంతరించుకున్నది. నామినేషన్ల ఘట్టం ఊపందుకున్న తరుణంలో పార్టీ అధినేత పర్యటనను ప్రతిష్టాత్మంగా తీసుకొని ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే సీఎం కేసీఆర్ ఉమ్మడి జిల్లాలో మూడు చోట్ల ప్రజా ఆశీర్వాద సభల్లో పాల్గొన్నారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించాగానే గత నెల 18న జడ్చర్ల పట్టణంలో భారీ బహిరంగ సభలో పాల్గొని ఉమ్మడి జిల్లాలో ఎన్నికల శంఖారావాన్ని పూరించారు. ఆదే నెల 26న అచ్చంపేట, వనపర్తి నియోజకవర్గాల్లో పర్యటించి రాజకీయ వేడిని రగిలించారు. సోమవారం మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర, జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో, నారాయణపేట జిల్లా కేంద్రంతోపాటు మక్తల్‌లో భారీ బహిరంగ సభలు ఏర్పాటు చేస్తున్నారు. ఒకే రోజుల నాలుగు సభల్లో గులాబీ పార్టీ అధినేత అభ్యర్థుల తరఫున ప్రచారం చేస్తుండడంతో పార్టీ నాయకులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే సభలు నిర్వహించే స్థలాలను చదును చేసి హెలీప్యాడ్‌కు ఏర్పాట్లు పైనల్ చేశారు. నాలుగు చోట్ల పార్టీ అభ్యర్థులు పోటాపోటీగా ప్రచార సభలను విజయవంతం చేసేందుకు శ్రమిస్తున్నారు. ఒకవైపు ప్రచారం చేస్తూనే మరోవైపు సీఎం సభకు జనసమీకరణ చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. ఆయా నియోజకవర్గాల్లోని పార్టీ అభ్యర్థులు, ఇన్‌చార్జీలు, ప్రజాప్రతినిధులు, నాయకులు మండలాల వారీగా భారీ సమీకరణ బాధ్యతను కార్యక్రమాలు నిర్వహించే బాధ్యతలను అప్పగించారు. ఇప్పటికే ఆయా నియోజకవర్గాల్లో ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశాలకు ఆయా నియోజకవర్గాల ఇన్‌చార్జీలు, ముఖ్యనేతలు, ప్రజాప్రతినిధులు, నాయకులు మండలాల వారీగా భారీ సమీకరణ బాధ్యతను అప్పగించారు.